క్లుప్తంగా

స్థానికసంస్థలకే సర్వాధికారాలు ఇవ్వాలి

బొబ్బిలి: స్థానికసంస్థలకు సింగిల్ విండో పద్ధతిలో సర్వాధికారాలు ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో శనివారం మాట్లాడుతూ రాజకీయ ప్రమేయం లేకుండా స్థానికసంస్థలకు అధికారాలు ఇవ్వడం ద్వారా ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కృత్రిమ మేధ, డ్రోన్‌ల వ్యవస్థ గురించి చెప్పుకుంటున్నాం కానీ బహిరంగ మలవిసర్జన మాత్రం నివారించలేకపోతున్నామన్నారు

నవంబరు 10లోగా బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలి



రైస్‌మిల్లర్లు, పీఏసీఎస్ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: ధాన్యం సేకరణకు సంబంధించి, మండలంలోని రైస్‌మిల్లర్లంతా నవంబరు 10వ తేదీలోగా బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని తహసీల్దారు మల్లపురెడ్డి శ్రీను తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని రైస్ మిల్లర్లు, పీఏసీఎస్ సభ్యులతో శనివారం సమావేశమైన ఆయన.. ప్రభుత్వ నిబంధనలు, విధానాలు తూ.చ తప్పకుండా పాటించాలని, ధాన్యం కోసం గోనె సంచులను పీఏసీఎస్‌లకు అప్పగించాలన్నారు. నవంబరు ఒకటో తేదీ నాటికి గోనె సంచులు రైతులకు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ,హెచ్‌డీటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని షాపులకు తాళాలు



దుకాణానికి తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బొబ్బిలి: మున్సిపాలిటీకి సంబంధించిన షాపింగ్‌కాంప్లెక్స్‌లోని షాపుల అద్దెలు చెల్లించని వాటికి అధికారులు శనివారం తాళాలు వేశారు. ఆరిగంగయ్య షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని మొత్తం ఆరు షాపులను మున్సిపల్ అధికారులు మూసివేశారు. నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌లలో రూ.28 లక్షల వరకు అద్దె బకాయిలు ఉన్నప్పటికీ రూ.3 లక్షలకు పైబడి అద్దె బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరుగురికి చెందిన షాపులను నిలిపివేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి నాగరాజు, ఆర్‌ఐ పి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వితరణ



ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అందిస్తున్న గ్రామస్తులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలను గ్రామస్తులు శనివారం వితరణ చేశారు. హెచ్‌ఎం చింతా రమణ మాట్లాడుతూ గతంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కంప్యూటర్లు, ఇతర ఉపకరణాలు కాలిపోయాయని, దీంతో పాఠశాలలో ఆన్‌లైన్ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న విషయాన్ని గ్రామపెద్దలకు తెలుపగా రూ.25 వేలతో కంప్యూటర్, మరో రూ.20 వేలతో కలర్ ప్రింటర్‌ను అందజేశారన్నారు. కార్యక్రమంలో దాతలు మాజీ సర్పంచ్, జెడ్పీటీసీలు బేతనపల్లి శివున్నాయుడు, రమణమూర్తి, స్వామినాయుడు, గొంగాడ విద్యాసాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



ఎస్‌డబ్ల్యూపీసీ సందర్శనలో ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: మండలంలోని కోటిపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శనివారం సందర్శించారు. అక్కడి కేంద్రానికి కొత్త రంగులు వేయడం, పరిసరాలను పరిశుభ్రం చేయడాన్ని ఆయన అభినందించి, పలు సూచనలు చేశారు. గ్రామంలో సేకరించిన చెత్తచెదారం ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి, తక్కువ ధరకే రైతులకు అందించి తద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాచేసి.. దోచేస్తున్నారు!

- బాణసంచా విక్రయాల్లో నిబంధనల ఉల్లంఘన
- అధిక ధరలకు విచ్చలవిడిగా అమ్మకాలు
- అనధికార బిల్లులతో దోపిడీకి యత్నం
- గ్రామాలకు ముందస్తుగానే మందుగుండు సామగ్రి తరలింపు



పెనుబాక సమీపంలో ఓ షాపు వద్ద సేఫ్టీ లేకుండా బాణసంచా విక్రయాలు



షాపు వద్ద డంప్ చేసిన క్రాకర్స్ బాక్సులు



గ్రామాలకు తరలించేందుకు సిద్ధం చేసిన బాణసంచా సామగ్రి మూటలు

రాజాం: చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరికీ అత్యంత ఇష్టమైనది దీపావళి. మరో వారం రోజుల్లో ఈ పండగ రానుంది. ఈ నేపథ్యంలో బాణసంచా విక్రయదారులు అక్రమ దోపిడీకి దారిచూసుకున్నారు. 365 రోజుల పర్మిషన్‌తో రాజాం పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో పెనుబాక సమీపంలో రెండు షాపులు నడుస్తున్నాయి. ఆయా షాపుల్లో గత వారం రోజుల నుంచి బాణసంచా విక్రయాలు అధికమయ్యాయి. ఓ వైపు ప్రజల కన్నా గ్రామాల్లోని వ్యాపారులే వీటిని అధికంగా కొనుగోలు చేస్తుండగా, మరోవైపు ఆయా షాపుల యజమానులు పెద్దపెద్ద గ్రామాలకు అక్రమంగా బాణసంచాను తరలించి, విక్రయాలకు సిద్ధపడుతున్నారు.

నిబంధనలేవీ..?

బాణసంచా విక్రయాలకు సంబంధించి పెనుబాక సమీపంలోని షాపు వద్ద పూర్తిగా నిబంధనల ఉల్లంఘన కనిపిస్తోంది. షాపు వద్ద సింగిల్ డోర్ మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రమాదం సంభవిస్తే ప్రజలు తప్పించుకునే వీలు లేని విధంగా షాపు ఉంది. ఫైర్ సెఫ్టీ లేకుండానే భారీ ఎత్తున బాణసంచా నిల్వలు ఉన్నాయి. విక్రయాలు చేసే షాపు వద్ద కొద్ది మోతాదులో శాంపిల్స్ ఉంచి, గొడౌన్‌లో మిగిలిన సరుకులు నిల్వ చేయాలి. అలా కాకుండా ఇక్కడ షాపులోనే అత్యధిక నిల్వలు కనిపిస్తున్నాయి. షాపు వద్ద బాలలను కూడా పనిలో పెట్టుకుని బాణసంచా విక్రయాలు చేస్తున్నారు. రాత్రి 10 గంటల వరకు షాపులు కొనసాగుతుండడం, రాత్రి వేళల్లోనే గోనె సంచుల్లో బాణసంచా సామగ్రి తరలిస్తుండడం పలు అనుమానాలకు తావునిస్తోంది. గ్రామాల్లో వాటిని ముందుగానే నిల్వ చేసి, పండగ రోజున అధిక ధరకు విక్రయించుకునేందుకు ఏజెంట్లను కూడా సిద్ధం చేసుకుంటున్నారు.

గతంలో ప్రత్యేక నిఘా..

గతేడాది వరకు అటు ఫైర్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ అధికారులు, ఇటు పోలీసులు ఈ బాణసంచా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉండేది. అధికంగా బాణసంచా కొనుగోలు చేసి తరలిస్తే చాలు వాటిని సీజ్ చేసి పట్టుకునేవారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు మాత్రమే విక్రయాలకు అనుమతులు ఉండేవి. ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వీటికి తోడు కొనుగోలుదారులకు అధికారికంగా బిల్లులు సైతం ఇవ్వడం లేదు. అనధికారికంగా సాధారణ తెల్లకాగితంపై అడ్రస్‌లు లేకుండా బిల్లులు ఇస్తున్నారు. ఎమ్ఆర్‌పీ ధరలకు కాకుండా ఇష్టానుసారం ధరలు వేసి అమ్మకాలు కొనసాగిస్తుండడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ధరల నియంత్రణపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించకపోవడంతోనే వారు వారికి నచ్చినట్లు అమ్ముతున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇక్కడ బాణసంచా నిల్వలపై రాజాం ఫైర్ సిబ్బందికి ఎటువంటి సమాచారం లేకపోవడం కొసమెరుపు.

> **చర్యలు తీసుకుంటాం..**
>
> రాజాంలో రెండు బాణసంచా విక్రయ షాపులు ఉన్నాయి. వాటికి 365 రోజుల పర్మిషన్ ఉంది. ప్రతీ వ్యక్తికి పరిమితంగానే బాణసంచా విక్రయించాలి. బిల్లులు కూడా అధికారికంగా ఇవ్వాలి. షాపులను తనిఖీ చేసి, బిల్లుల చెల్లింపు పత్రాలు, అక్కడ ఏర్పాట్లపై ఆరాతీస్తాం. గ్రామాల్లో బాణసంచా విక్రయాలు చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం టౌన్

ప్రజాసేవే లక్ష్యం

- చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మజ్జి సిరి సహస్ర



మాట్లాడుతున్న చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మజ్జి సిరి సహస్ర

రామభద్రపురం: రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మజ్జి సిరి సహస్ర అన్నారు. మండల కేంద్రంలోని క్వీన్స్ ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవల ప్రారంభోత్సవ కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. జిల్లాలో చాలామంది చిరు వ్యాపారుల జీవనోపాధికి తమ అసోసియేషన్ తరఫున తోపుడుబళ్లు అందించామన్నారు. అలాగే దివ్యాంగులు(కాళ్లు లేని వారికి)కు మూడు చక్రాల సైకిళ్లు, నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు అందజేశామన్నారు. చుట్టు పక్కల ఆస్పత్రుల్లో ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో లేవని, ఇప్పటి నుంచి క్వీన్స్ ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఉచిత ఆరోగ్యశ్రీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైఎస్సార్ సీపీ మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కోమటిపల్లి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్: రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని కోమటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన యోగా, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, చదరంగం క్రీడా పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో పాల్గొన్న పలువురు ఆయా పోటీల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. ఎంపికైన వారిలో లంక జాహ్నవి, చందనపల్లి రవీనాశ్రీ, పిల్లా శాంతి, ఎస్.శివన్నారాయణలు ఉండగా, వారిని పీడీ ఎం.రాజేశ్వరిని ఉపాధ్యాయ సిబ్బంది శనివారం అభినందించారు. పోటీలకు వెళ్లేందుకు గాను ఉపాధ్యాయుడు దాసరి వెంకటనాయుడు కొంత నగదు సాయం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆక్రమణదారులు శిక్షార్హులు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక మిలటరీ కాలనీ సమీపంలో ఉన్న మున్సిపల్ చెరువులోని స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి బురిడి శంకరరావు ఆక్రమణ చేసే ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం రాత్రి అడ్డుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమణదారులు శిక్షార్హులు అని తెలిపే హెచ్చరిక బోర్డు శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్‌కుమార్, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని అనేక చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ఒమ్మి రమణ, కోట అప్పన్న, అలమండ ఆదినారాయణ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలో తహసీల్దారు మల్లపురెడ్డి శ్రీనును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

పశుగణన ప్రారంభం

తెర్లాం: పాడిరైతులు, గొర్రెలు, మేకల కాపరులంతా పశు గణనను సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు కోరారు. మండలంలోని కూనాయవలస, పెరుమాళి, వి.చిన్నయ్యపేట, కవిరాయునివలస తదితర గ్రామాల్లో పశు గణన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. కూనాయవలసలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఎన్ని పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు ఉన్నాయో తెలుసుకునేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఎన్ని పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు ఉన్నాయో వంటి వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం పశుగణన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

● ఆయుధాల వినియోగంపై అవగాహన



బొబ్బిలి: తుపాకుల గూర్చి వివరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్



రాజాం సిటీ: విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ ఆయుధాల ప్రదర్శన శనివారం చేపట్టారు. డీఎస్పీలు, ఎస్ఐలు కలిసి పోలీసులు విధి నిర్వహణలో వాడే ఆయుధాలు, వాటి పని తీరును విద్యార్థులకు వివరించారు. అలాగే వివిధ నేరాలు వాటికి వేసే శిక్షలు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా ఈ కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నామని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

– బొబ్బిలి, రాజాం సిటీ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రేగిడి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. మండలంలోని సంకిలి, ఉంగరాడ, బూరాడ, కందిశ, ఖండ్యాం తదితర గ్రామాల్లో శనివారం చేపట్టి పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి, సర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామ రామాలయం సమీపంలో శ్రీనివాసుని కల్యాణం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ 2050వ రోజు అన్నదానం సందర్భంగా ఈ కల్యాణం చేశారు. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి దంపతులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



వన్నలిలో సీసీ కాలువల నిర్మాణ పనులు

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, అక్కరన్నఅగ్రహారం, సరసనాపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. 15వ ఆర్థికసంఘం నిధులతో ఈ పనులు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. పలుచోట్ల జరుగుతున్న ఈ పనులను ఆయన శనివారం పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు.

చిన్నారులకు ప్రీస్కూల్ ఎంతో మేలు

తెర్లాం:అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ చిన్నారులకు ఎంతో మేలు అని తెర్లాం నుంచి బదిలీపై వెళ్లిన బొబ్బిలి ఎస్ఐ ఆర్.రమేష్ అన్నారు. తెర్లాంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని ప్రీస్కూల్‌లో చదువుతున్న చిన్నారులందరికీ తన సొంత డబ్బులతో కొనుగోలు చేసిన బ్యాగ్‌లను వితరణగా అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను కార్యకర్త వై.శ్రీదేవి అందించడం అభినందనీయమన్నారు.

భారీగా ఇసుక తరలింపు



వంగర: ఓనెఅగ్రహారం వద్ద నాటుబళ్లతో తెచ్చిన ఇసుకను ట్రాక్టర్లలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

వంగర: మండలంలోని నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి భారీగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తరలింపుపై ప్రభుత్వం ఆంక్షలు ఎత్తివేయడంతో ఓనెఅగ్రహారం, కింజంగి, రాజులగుమ్మడ తదితర గ్రామాల నదీతీరాల నుంచి ట్రాక్టర్లు, నాటుబళ్ల ద్వారా రాజాం, బలిజిపేట, బొబ్బిలి, వీరఘట్టాం ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారు.

ప్రతీ పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందాలి



ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ప్రతీ పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని క్వీన్స్ ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు, మేల్, ఫిమేల్ వార్డులను చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మజ్జి సిరి సహస్ర, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతిలతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఆరోగ్య భరోసానిస్తూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం అమలు చేసి, ఎంతోమంది ప్రాణాలు కాపాడారన్నారు. అలాగే ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తరించి, పేదలకు అండగా నిలిచారన్నారు. ఇప్పుడు ఎస్ఆర్ఐ ఆస్పత్రి యాజమాన్యం ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ సెక్రటరీ రెడ్డి పావని, జిల్లా అధ్యక్షురాలు క్వీన్స్ ఎస్ఆర్ఐ ప్రతినిధులు రమేష్, డాక్టర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: డిసెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, బ్యాంకు అధికారులు, పోలీసులతో శనివారం సమావేశమైన ఆయన.. రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ పరిష్కరించడం జరుగుతుందన్నారు. న్యాయవాదులు, పోలీసులు లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. కక్షిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌పీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు, ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, ఏజీపీ ఎస్.పోలారావు, టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో పరిశీలన



ఆరికతోటలో భూ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

రామభద్రపురం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. మండలంలోని ఆరికతోట రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 268లో ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉన్నట్లు ఆ గ్రామ రైతు పెంకి అప్పయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ సులోచనరాణితో కలిసి శనివారం అక్కడికి వెళ్లి ఆ భూమిని పరిశీలించారు. 268 సర్వే నంబరులో ఉన్న భూమి.. 268లో 1, 268లో 2గా రెండు సబ్‌డివిజన్‌లుగా ఉండగా, 268-1 ప్రభుత్వ భూమిగాను 268-2 జిరాయితీ భూమిగా ఉంది. అయితే ప్రభుత్వం భూమి ఆక్రమించుకోలేదని నిర్ధారించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఎవరు ఆక్రమించినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో చేపట్టిన రీసర్వేలో సాంకేతిక కారణాల వల్ల విస్తీర్ణం, పేర్లలో తప్పులు పడినా, ఏవిధమైన భూ సమస్యలున్నా పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో వినతులు ఇవ్వాలన్నారు. భూ రికార్డుల ప్రకారం అన్నీ సక్రమంగా ఉంటే వినతులు వచ్చిన 45 రోజులకు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్కిన శ్రీనివాసరావు, వీఆర్వో శైలజ, సచివాలయ సర్వేయర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



బాడంగి: వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

బొబ్బిలి: ఎక్సైజ్ శాఖ బొబ్బిలి సర్కిల్ పరిధిలోని బాడంగి మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయం, సామాజిక ఆస్పత్రి, మసీదులకు దగ్గరలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తరలించాలని బాడంగి సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు డి.శ్రీనివాసరావు కోరారు. ఇదే విషయమై బొబ్బిలి సర్కిల్ కార్యాలయానికి శనివారం వెళ్లి, అక్కడి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మరడాన రాము, బలిజి అప్పలనాయుడు, మరడాన సత్యం, గుణుపూరు భీమ, గుణుపూరు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: నిబంధనలు బేఖాతరు చేస్తూ స్థానిక మెయిన్‌రోడ్డు పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని స్థానిక టీడీపీ నాయకులే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మరడాన రాము, గుణుపూరు స్వామినాయుడు, వార్డు మెంబరు రాము తదితరులు కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయానికి శనివారం వెళ్లి, తహసీల్దారు కె.సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును అక్కడి నుంచి తొలగించి, వేరే చోట ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గణితశాస్త్రం మెటీయల్ పంపిణీ



గణితశాస్త్రం మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ డీఈవో మోహన్‌రావు

తెర్లాం: ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం తయారు చేసిన గణితశాస్త్రం మెటీరియల్ పదో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని బొబ్బిలి డిప్యూటీ డీఈవో కె.మోహన్‌రావు అన్నారు. మండలంలోని నందబలగ హైస్కూల్‌లో విద్యార్థులకు గణితశాస్త్రం మెటీరియల్‌ను ఆయన చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గణితంలో మంచి మార్కుల సాధనకు ఈ మెటీరియల్ దోహదపడుతుందన్నారు. విద్యార్థులంతా ఈ మెటీరియల్‌ను చక్కగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు, హెచ్‌ఎం సీతారాం, గణిత ఫోరం సభ్యులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకచోట తొలగించారు.. మరోచోట వదిలేశారు..!

రామభద్రపురం: గ్రామంలో పలుచోట్ల అపారిశుధ్యం పేరుకుపోవడంపై ఈ నెల 26వ తేదీన ఇదేమి 'చెత్త' పాలన అనే శీర్షిక పేరిట ఓ కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన రామభద్రపురం మేజర్ పంచాయతీ అధికారులు శనివారం ఒకచోట చెత్తకుప్పలను తొలగించారు. మరో తొలగించలేదు. మండల కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులతో చొక్కాపు వీధి నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలో ఉన్న చెత్తను తొలగించారు. చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను తొలగించకుండా అలానే ఉంచారు. పాఠశాలకు పిల్లలను తీసుకువస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలు అనారోగ్యం బారిన పడతారేమోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పాఠశాల ఆవరణలోని చెత్తకుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

రాజాం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎస్‌కే రాజు కోరారు. మండలంలోని ఎంజే వలస గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, కాసేపు మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో ఏవైనా తప్పులుంటే వాటిని సరిదిద్దేందుకు దరఖాస్తులు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అనంతకుమార్, ఆర్‌ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



వంగర: విద్యార్థుల విద్యాప్రమాణాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

వంగర: విద్యార్థుల విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచాలని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)ని సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, భోజనాల నాణ్యత, విద్యార్థుల విద్యాప్రమాణాలు పరిశీలించారు. విద్యలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో మెలగి, బాగా చదువుకోవాలని సూచించారు.

రాజాం సిటీ: పాఠశాలల్లో విద్యార్థులు శతశాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. స్థానిక పట్టణ పరిధిలోని వస్త్రపురికాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాలు రుచి చూసి పరిశీలించారు. ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని తెలిపారు. అలాగే విద్యార్థుల అపార్ నమోదు పూర్తి చేయాలన్నారు.